ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

ఆదివారం 23 జూన్ 2024

రాణాలో పైసా వసూల్

మరమ్మతుల పేరుతో మామూళ్లు

పోలీసుల పనితీరుపై జనం అసహనం
అవినీతికి అడ్డాగా గాండ్లపెంట పోలీస్‌స్టేషన్



సమస్యలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళితే పైసలు సమర్పించుకోవాల్సిందే నని ప్రజలు వాపోతున్నారు. మండల పరిధిలో నిత్యం వాహనదారులు వివిధ ప్రమాదాలకు గురవుతున్నారు. వాటిని అలుసుగా తీసుకుని, స్టేషన్‌లో పంచాయితీలు నిర్వహించి, మామూళ్లు తీసుకుని బాధితులకు అన్యాయం చేస్తున్నారనే ఆరోపణలు ఇక్కడి పోలీసులపై వినిపిస్తున్నాయి. ఈ పోలీస్ స్టేషన్‌లో ప్రతి పనికి ఓ రేటు ఉన్నట్లు ప్రజలు విమర్శిస్తున్నారు. పేకాట, బెట్టింగ్, బెల్టు షాపుల నిర్వహణ పోలీసుల కన్ను సన్నల్లోనే జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్న, వారి నుంచి మామూళ్లు తీసుకుని, చూసీ చూడనట్లు వదిలేస్తున్నారనే చర్చ కూడా ఉంది.

- గాండ్లపెంట

కప్పం చెలిస్తేనే వాహనాలు ముందుకు..

మండలంలో వివిధరకాల వస్తువులు, జంతువులు తరలించే వాహనాలు ముందుకు పోవాలంటే గాండ్లపెంటపెంట పోలీస్‌స్టేషన్‌లో కప్పం చెల్లించాల్సిం దేనని వాహనాదారులు వాపోతున్నారు. చిన్నపాటి వ్యాపారులను కూడా వదలకుండా మామూళ్లు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి వాహనానికి రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారని వాహనదారులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో బడా వ్యాపారులు కూడా అనుమతి లేని వాహనాలను సులువుగా దాటించేస్తున్నట్లు సమాచారం.

నెలనెలా మామూళ్లు

మండలంలో మైనింగ్ వ్యాపారులు నెలనెలా మామూళ్లు చెల్లించాల్సిందే. లేదంటే పేలుడు పదార్థాలకు అనుమతులు లేవని సీజ్ చేస్తామన్న బెదిరింపులతో తప్పనిసరి పరిస్థితుల్లో మామూళ్లు అందిస్తున్నట్లు సమాచారం. మామూళ్లు ముడితే చాలు అధిక లోడుతో వెళ్తున్న లారీలను సైతం ఏమాత్రం పట్టించుకోరు. రోడ్డు ప్రమాదాలు జరిగితే స్టేషన్‌లో పంచాయితీలు చేసి, మామూళ్లు తీసుకుని, కేసులు నమోదు చేయడంలేదన్న విమర్శలున్నాయి. ఈరూట్‌లో తమిళనాడుకు పశువులు తరలించే వాహనాలు ఎక్కువగా వెళ్తుంటాయి. ప్రతినెలా వారి నుంచి మామూళ్లు వస్తున్నట్లు సమాచారం.

జీపు మరమ్మతులకు పైసలివ్వండి

వివిధ కేసుల నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు వెళితే జీపు మరమ్మతులకు డబ్బులివ్వాలని అధికారులు అడగడం ఏమిటని పలువురు ఫిర్యాదుదారులు మండిపడుతున్నారు. ఇటీవల ఓ మండల నాయకుడికి వచ్చిన సమస్య పరిష్కారానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లితే డబ్బులు అడిగినట్లు సమాచారం. ఇవే కాకుండా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని పక్కనే ఉన్న అన్నమయ్య జిల్లాకు తరలించే వ్యాపారి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తోంది. వాటాలు కుదరకపోవడంతో ఈవిషయాన్ని బయట పెడతానని కింది స్థాయి సిబ్బంది ఓ పైఅధికారితో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది.



గాండ్లపెంట పోలీస్ స్టేషన్





ఈ జీపు మరమ్మతులకే.. డబ్బు వసూలు..



మామూళ్లూ అందచేసి పోతున్న వాహనదారుడు

నిఘానేత్రాలు ఆఫ్

పోలీస్‌స్టేషన్‌లో ఉన్న నిఘనేత్రాలు(సీసీ కెమేరాలు) ఆఫ్ చేస్తున్నారు. పోలీసుల లోపాయికారి పనులు ఇందులో రికార్డు అవుతాయని, అలా అయితే జిల్లా అధికారులు వీటిని పసికట్టే అవకాశముందని భావించిన స్టేషన్ అధికారులు వాటి ఆఫ్ చేశారు. సీసీ కెమేరాలు లేక పోవడంతో నిర్భయంగా వసూళ్లకు దిగుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నేడు మంత్రి సవిత రాక

స్వాగతం పలికేందుకుభారీ ఎత్తున ఏర్పాట్లు



పెనుకొండ టౌన్/పుట్టపర్తి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ, హ్యాండ్‌లూమ్స్, టెక్స్‌టైల్స్‌శాఖ మంత్రి సవిత ఆదివారం జిల్లాకు రానున్నారు. ఉదయం 9:30 గంటలకు బెంగళూరు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడనుంచి చిక్‌బళ్లాపురం మీదుగా జిల్లా సరిహద్దు భాగేపల్లి టోల్‌ప్లాజాకు రోడ్డుమార్గాన చేరుకోనున్నారు. అక్కడి నుంచి స్వాగతం ర్యాలీ ప్రారంభమై పెనుకొండకు చేరుకుంటుంది. మంత్రిని కలిసేందుకు వచ్చే నాయకులు, కార్యకర్తలు బొకేలు, పూలహారాలు తేవద్దని నిరుపేద విద్యార్థులకు ఉపయోగపడేలా నోటు పుస్తకాలు, పెన్నులు తదితర విద్యాసామగ్రితో రావాలని మంత్రి కార్యాలయం వర్గాలు సూచించాయి.

భారీగా తరలిరండి

ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి హోదాలో తొలిసారి పెనుకొండకు వస్తున్న సవితను స్వాగతించడానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు భారీగా తరలిరావాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు వడ్డే అంజినప్ప కోరారు. ఉదయం 11 గంటలకు బాగేపల్లి టోల్‌ప్లాజా వద్దకు చేరుకోవాలని అక్కడి నుంచి పెనుకొండ వరకు స్వాగతం ర్యాలీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు



అదృశ్యమైన బాలిక కీర్తన

గోరంట్ల, జూన్ 22: పట్టణంలోని ఆంజనేయస్వామి కాలనీలో నివాసముంటున్న కీర్తన అనే బాలిక ఈనెల 19న అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని సీఐ సుబ్బరాయుడు తెలిపారు. కీర్తన గో రంట్లలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. అమ్మాయిని ఆరు నెలల వయసులోనే తండ్రి వదిలిపెట్టి వెళ్లిపోయా డు. తల్లి కళావతి కూడా సరిగా పట్టించుకోకపోవడంతో చిన్నారి అ మ్మమ్మ శకుంతల వద్ద ఉంటూ చదువుకుంటోంది. అయితే ఈనెల 19న ఉదయం ఎనిమిది గంటల సమయం నుంచి కీర్తన కనిపించలే దని శకుంతల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కక్ష సాధింపు ధోరణి మానుకోవాలి

పీడీ సస్పెన్షన్ ఎత్తివేయాలి
డీఈఓకు ఫ్యాప్టో నాయకుల వినతి

కొత్తచెరువు, జూన్ 22: జిల్లాలో ఉపాధ్యాయులపై డీఈఓ కక్ష సాధింపు ధోరణి అవలంబిస్తున్నారని ఫ్యాప్టో నాయకులు మండిపడ్డారు. డీఈఓ కార్యాలయం ఎదుట శనివారం సాయంత్రం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా డే సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాలను డీఈఓ మీనాక్షి తనిఖీ చేశారన్నారు. మీరెందుకు యోగా దినోత్సవాన్ని జరుపుకోలేదని అక్కడి సిబ్బందిని ప్రశ్నిస్తూ, ఎందుకింత నిర్లక్ష్యమంటూ హెచ్‌ఎం నూర్జహాన్, పీడీ జానకిపై మండిపడుతూ అసభ్యపదజాలంతో దూషించారన్నారు. దీంతో హెచ్‌ఎం, పీడీ తమకు సమాచారం ఎవరూ ఇవ్వలేదని తాము ప్రార్థన అనంతరం 9గంటలకు యోగా నిర్వహించేందుకు సన్నద్ధమయ్యామని తెలిపారన్నారు. అయితే అంతకు ముందే వచ్చిన డీఈఓ తమపై కక్ష సాధింపు ధోరణితో ప్రవర్తించడమే కాకుండా అసభ్యపదజాలంతో మాట్లాడారని వారు వాపోయారు. షోకాజు నోటీసు కూడా ఇవ్వకుండా, పీడీ జానకికి సస్పెన్షన్ నోటీసులు ఇవ్వడం ఏంటని ఉపాధ్యాయ సంఘం నాయకులు ధర్నాలో మండిపడ్డారు. పీడీ సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ నిరసన తెలిపారు. సస్పెన్షన్ ఎత్తివేయకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం డీఈఓకు వారు వినతి పత్రం సమర్పించారు. పీడీ సంజాయిషీ ఇస్తే సస్పెన్షన్ ఎత్తివేస్తానని హామీ ఇవ్వడంతో ఉపాధ్యాయసంఘం నాయకులు ధర్నాను విరమించారు.



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

సమస్యలను అధిగమించడం వల్లే సక్సెస్: ఎస్పీ



సిబ్బందితో ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి రూరల్, జూన్ 22: ఎన్నో సమస్యలు ఉన్నా వాటిని అధిగమించి పనిచేయడం వల్లే సక్సెస్ అయ్యామని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఎన్నికల సమయంలో పనిచేసిన డీపీఓ సిబ్బంది, ఎస్పీ కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ, ఏఆర్ తదితర సిబ్బందికి ఎస్పీ అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేస్తే ఎటువంటి సవాళ్లనైనా అధిగమించవచ్చన్నారు. కొత్త జిల్లా అయిన సిబ్బంది తమకు అప్పగించిన విధులు సక్రమంగా నిర్వహించారని అందువల్లే నేడు జిల్లాను రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానంలో నిలిపామన్నారు. ఎన్నికల ముందు జిల్లాలో పర్యటించిన వీఐపీ, వీవీఐపీల కార్యక్రమాలలో శాంతిభద్రతలకు విఘాతం కల్గకుండా సక్సెస్ చేశారన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఓ సుజాత, సీసీ రాఘవేంద్ర, సూపరింటెండెంట్ సరస్వతి, ఎస్బీసీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, డీసీ ఆర్‌టీ సీఐ హర్ష, ఆర్‌ఐలు రవికుమార్, వలి ఎస్బీ ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

అలరించిన భక్తిగీతాలాపన



పాటలు పాడుతున్న ప్రకాశం జిల్లా భక్తులు

పుట్టపర్తి, జూన్ 22: ప్రకాశం జిల్లా భక్తులు తమ భక్తిగీతాలాపనతో సందర్శకులను అలరింపచేశారు. వారు పర్తి యాత్రపేరుతో శనివారం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంతు సభా మందిరంలో గానప్రకాశం పేరిట సంగీత గాన కచేరి నిర్వహించారు. గంట పాటు మధురగానంతో భక్తులను మైమరపింపచేశారు. అనంతరం సత్యసాయిమహాసమాధిని దర్శించుకున్నారు.

బాలల హక్కులను పరిరక్షిద్దాం

● ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి



సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మీకుమారి

పుట్టపర్తి, జూన్ 22: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కా ర్యాలయంలో శనివారం బాలల హక్కులపరిరక్షణపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి పీడీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలల చట్టాలపైన అందరికీ అవగాహన ఉండాలన్నారు. బాలికలపై లైంగిక దాడులను పూర్తిగా అరికట్టాల్సి ఉందన్నారు. బాల్యవివాహాల నిరోధాల చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాలబాలికలను రక్షించుకోకపోతే భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. చట్టాలను అమలు చేయడంలో అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాపరిరక్షణ అధికారి మహేశ్, డీసీటీఓ ప్రొటెక్షన్ అధికారులు నాగలక్ష్మి, మురళీధర్, సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగప్రసాద్, బీసీ వెల్ఫేర్ డీడీ నిర్మలాజ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి మోహన్ రావు, చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి సం పూర్ణ, హెచ్‌డబ్ల్యూఓలు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహించరాదు: జేసీ



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి, జూన్ 22: ఉద్యోగులు విధుల పట్ల అలసత్వం వహించరాదని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం ఆయన డీఆర్వో కొండయ్యతో కలిసి ముఖ్యవిభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉద్యోగులు ప్రజలతో మమేకమై నిరంతరం అప్రమత్తంగా ఉండి విధులు నిర్వర్తించాలన్నారు. ఎలాంటి అలసత్వం వహించరాదన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగం ఎల్లవేళలా ముందుండాలన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల దృష్ట్యా మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఏఓ రామాంజనేయరెడ్డి, సూపరింటెండెంట్ వసుంధర, ఈడీటీ మైనోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలతో చెరువులు నింపండి

మంత్రికి ఎమ్మెల్యే రాజు వినతి



నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి వినతిపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, జూన్ 22: బైపాస్ కెనాల్ ద్వారా గొల్లపల్లి నుంచి నేరుగా మడకశిరకు నీరు అందించాల ని, హంద్రీనీవా కాలువల ద్వారా ప్రతి చెరువును నీటి తో నింపేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడును కోరారు. ఆయన శనివారం అసెంబ్లీ సమావేశాల అనంతరం మంత్రి నిమ్మలను కలిశారు. పెండింగ్‌లో ఉన్న హంద్రీనీవా కాలువ పనులను పూర్తి చేసి, వెనకబడిన ప్రాంతమైన మడకశిరకు కృష్ణా జలాలు అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని కోరినట్టు ఆయన తెలిపారు. అలాగే ఐదు మం డలాల్లో చెరువులకు నీరిచ్చేలా కృషి చేయాలని మంత్రిని కోరామన్నారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి మ డకశిరలో వంద పడకల ఆస్పత్రి అర్థంతరంగా ఆగిపోయిందని, వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. అందుకు మంత్రి స్పందించారని, అలాగే అగళి, గుండుమల ప్రాథమిక వైద్య కేంద్రాలను రౌండ్ ద క్లాక్ పీహెచ్‌సీలుగా చేసేందుకు కృషి చేస్తా మని తెలిపారన్నారు. అనంతరం బీసీ సంక్షేమ మంత్రి సవితను కలిసి మడకశిరలోని బాలురు, బాలికల గురు కుల పాఠశాలల్లో 10 శాతం సీట్లు పెంచాలని కోరామన్నారు. మడకశిర నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా, ప్రణాళిక బద్ధంగా ముందుకెళుతున్నట్లు ఎంఎస్ రాజు తెలిపారు. ఆయనతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి తదితరులు ఉన్నారు.

ఏదైతే అదికానీ..!

పట్టా భూమికే ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్

- ప్లాట్లుగా విభజించి, ఫోర్జరీ సంతకాలతో విక్రయాలు
- వైసీపీ, రెవెన్యూ అధికారుల నిర్వాకం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- బాధితుడు రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్



ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు సృష్టించి విక్రయించిన స్థలం ఇదే..

హిందూపురం, జూన్ 22: పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో కొంత మంది అధికారులకు నిబంధనలు వర్తించనట్లు ఉంది. అందుకే కాసుల మీద ఆశతో పట్టా భూమిలో ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ సృష్టించారు. అంతటితో ఆగక ప్లాట్లు వేసి, ఫోర్జరీ సంతకాలతో విక్రయించేశారు. ఇందులో బాధితుడు రిటైర్ సబ్‌రిజిస్ట్రార్ కావడం గమనార్హం.

ప్రస్తుతం పట్టణంలో నివాసమున్న రిటైర్డ్ సబ్‌రిజిస్ట్రార్ గోపాలకృష్ణ హిందూపురం మండలంలోని మణేసముద్రంలో సమీపంలో 1.3ఎకరాలు పట్టా భూమిని కొనుగోలు చేశాడు. దీనికి అనుకుని కొంత ప్రభుత్వ భూమి ఉంది. అందులో జగనన్న లేఅవుట్‌లు వేశారు. ఆ పక్కనే సర్వేనంబరు 13జీ, 2బీ, 2ఏ లలో రిటైర్డ్ సబ్‌రిజిస్ట్రార్ గోపాలకృష్ణ 1.3ఎకరాల భూమి ఉంది. దీనికి అదేప్రాంతానికి చెందిన ఒకరిద్దరు వైసీపీ నాయకులు రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే ఒకరిద్దరు అధికారులతో కుమ్మక్కై ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ సృష్టించారు. ఒక్కోప్లాటు రెండు సెంట్లుగా విభజించి సుమారు 19మందికి విక్రయించారు. కొద్దినెలల క్రితం ఆ పొలంలో రాళ్లపాతి ప్లాట్లుగా విభజించారు. ఆ తరువాత గమనించిన యజమాని గోపాలకృష్ణ అక్కడికి వెళ్లి అడ్డుకున్నారు. ఈ సందర్భంలో వైసీపీ నాయకులు, ఫోర్జరీ సంతకాలతో ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు పొందినవారు గొడవకు దిగారు. దీంతో ఆయన అధికారుల వద్ద వెళ్లి మొరపెట్టుకున్నారు. వైసీపీ నాయకుల హస్తం ఉండటంతో అధికారులెవరూ స్పందించలేదు. దీంతో ఆ భూమి యజమాని కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. అయినా కొనుగోలు చేసిన వారు మాత్రం భూ యజమానిని తరచూ బెదిరిస్తూ వచ్చారు.

అధికారం మారడంతో వెలుగులోకి

రిటైర్డ్ సబ్‌రిజిస్ట్రార్ అయినా అధికార పార్టీ నాయకులకు అప్పట్లో భయపడి విషయం బయటకు చెప్పకుండా నలిగిపోయాడు. అయితే అధికారం మారి కూటమి అధికారంలోకి రావడంతో అక్రమాలను వెల్లడించడానికి బాధితుడు ధైర్యంగా ముందుకొచ్చాడు. శనివారం ఇదే విషంపై న్యాయం చేయాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను లేఖ ద్వారా కోరారు. ఆ ప్రతులను ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు. దీనిపై వెంటనే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, శ్రీనివాసరావులు స్పందించి ఇందులో పాత్ర ఉన్న రెవెన్యూ అధికారులు, వైసీపీ నాయకులు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు తీసుకున్నవారిపై జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

ఫోర్జరీ సంతకాలతో విక్రయాలు

సాధారణంగా ఎవరి సంతకమైనా ఫోర్జరీ చేస్తే పెద్ద నేరమంటారు. కానీ హిందూపురం రెవెన్యూ కార్యాలయంలో ఫోర్జరీ సంతకాలకు కొదవేలేదు. గతంలో పనిచేసిన ముగ్గురు నలుగురు అధికారులు తమ సంతకాలు ఫోర్జరీ చేశారని ఫిర్యాదు చేసిన సంఘటనలు చాలా ఉన్నాయి. అయినా ఆ ఫోర్జరీ సంతకాలు ఆగడం లేదు. రిటైర్డ్ సబ్‌రిజిస్ట్రార్‌కు చెందిన పట్టా భూమిలో 19మందికి రెండు సెంట్లు చొప్పున ఫోర్జరీ సంతకాలతో విక్రయాలు జరిపిన ఉదాంతమే అందుకు ఉదాహరణ. గత ఏడాది మణేసముద్రం వద్ద 1.3ఎకరాల భూమిలో 19మంది ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు పొందారు. ఒక్కోప్లాటు రూ.1.5లక్షల నుంచి 2లక్షల దాకా వసూలు చేసినట్లు తెలిసింది. అయితే ఈ ఫోర్జరీ సంతకాలలో రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులతోపాటు ఓ ప్రైవేట్ వ్యక్తి పాత్ర కూడా ఉన్నట్లు సమాచారం.

వైసీపీ, రెవెన్యూ అధికారుల కుమ్మక్కుతో ...

జగనన్న లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న పట్టా భూమి సర్వే నంబరు 13జీ, 2బీ, 2ఏలో ఉన్న భూమిలో 19మందికి ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు సృష్టించారు. ఇందులో ఒకరిద్దరు రెవెన్యూ అధికారులు ఏం చేశారంటే సర్వే నంబరు 13జీ, 2బీ, 2బీగా సృష్టించి అమ్మేశారు. దీనిపై రెవెన్యూ కార్యాలయంలో బాధితులు గోపాలకృష్ణ సమాచార చట్టం కింద కోరితే ఈ భూమిలో ఎవరికి పట్టాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం రాళ్లు పాతారు. అంటే సర్వేనంబరు ఏ ను బీ గా చేసి విక్రయాలు జరిపారు. అయితే వారు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్‌లో ఇచ్చిన సర్వేనంబరు అందులో ఉంది తప్ప క్షేత్రస్థాయిలో కానీ, రెవెన్యూ కార్యాలయంలోకానీ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కానీ లేదు. ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ పొందినవారు రెవెన్యూ అధికారుల ఎన్లార్జ్‌మెంట్ ద్వారా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ కూడా చేసుకున్నారు. అయితే ఇక్కడ కూడా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపిన ఎన్లార్జ్‌మెంట్ కాపీలో కూడా తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసి పంపినట్లు రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులే వెల్లడించడం గమనార్హం. సుమారు రూ.2కోట్లు విలువచేసే భూమిని వైసీపీ నాయకులు రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే ఒకరిద్దరు అధికారులు కుమ్మక్కై కాజేయడానికి పూనుకున్నట్లు సమాచారం.



సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు గోపాలకృష్ణ

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం టౌన్, జూన్ 22 : సుభాష్ చంద్రబోస్ పురస్కారాలు 2025 సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వినోద్ కుమార్ శనివారం ప్రకటించారు. విపత్తు నిర్వహణ రంగంలోని వ్యక్తులు, సంస్థలు చేసిన అద్భుతమైన కృషిని గుర్తించేందుకు భారత ప్రభుత్వం సుభాష్ చంద్రబోస్ పురష్కారం పేరుతో ఏటా జనవరి23 తేదీన అందజేస్తుందన్నారు. ఎంపికైన వ్యక్తికి లేదా సంస్థకు రూ.5లక్షల నగదు అందజేస్తారన్నారు. జూలై 1వతేదీనుంచి ఆగస్టు 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

జీఓ 117 రద్దుతోనే విద్యావ్యవస్థ మెరుగు

అనంతపురం విద్య, జూన్ 22 : రాష్ట్రంలో విద్యావ్యవస్థ బాగుపడాలంటే.... 117 జీఓ రద్దు చేయాలని ఏపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అనాలోచితంగా విడుదల చేసిన 117 జీఓ కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6,7,8 తరగతులను హై స్కూళ్లలో విలీనం చేశారన్నారు. దీంతో ఎస్‌జీటీ పోస్టులు వేల సంఖ్యలో రద్దు అయ్యాయని, డీఎస్సీలో టీచర్ పోస్టులు తగ్గాయన్నారు. అంతేకాకుండా తరగతి గదులు సైతం నిర్వీర్యం అయ్యాయని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 117 జీఓను రద్దు చేసి స్కూళ్లకు పూర్వవైభవం తేవాలని కోరారు.

'శ్రేష్ఠ' ప్రవేశ పరీక్షలో గురుకుల విద్యార్థుల ప్రతిభ

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 22 : దేశవ్యాప్తంగా నిర్వహించిన 'శ్రేష్ఠ' ప్రవేశ పరీక్షలో జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు గురుకులాల ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాయగా... 80 మంది ఎంపికయ్యారన్నారు. వారిలో 30 మంది విద్యార్థులకు 3 వేల లోపు ర్యాంకు వచ్చిందన్నారు. వీరిలో బి. పప్పూరు గురుకులం నుంచి 2, హిందూపురం బాలుర గురుకులం నుంచి 7, కురుగుంట గురుకులం నుంచి 18, హిందూపురం బాలికల గురుకులం నుంచి 3, కొర్రపాడు గురుకులం 4, తిమ్మాపురం 1, మలుగూరు 1, ఉరవకొండ 4, అమరాపురం 3 విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, విద్యార్థులకు తోడ్పాటునందించిన ఆయా గురుకులాల ప్రిన్సిపాల్స్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

రేపు ఉద్యోగమేళా

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 22: ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్ సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ఈనెల 24వతేదీన ఆర్టీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో రిలేషన్‌షిప్ ఆఫీసర్, సీనియర్ ఆర్‌ఓలుగా పనిచేసేందుకు అభ్యర్థులు అవసరమన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు వేతనంతో పాటు అన్నీ కలిపి రూ.20వేలు వరకు చెల్లిస్తామన్నారు. ఇంటర్ చదివి 20-30 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సోమవారం ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆధార్, డ్రైవింగ్‌లైసెన్సు, బ్యాంకు అకౌంట్ పాసుపుస్తకం, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9550676098, 8328528338లను సంప్రదించాలని కోరారు.

చీనీ కాయలు టన్ను రూ.32వేలు

అనంతపురంరూరల్, జూన్22: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.32వేలు, కనిష్టంగా రూ.10వేలు, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు 819టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నష్టాల పాలు.!



- ఆవు పాల ధరలు తగ్గించేశారు
- డిమాండ్ తగ్గిందంటున్న ప్రైవేట్ డెయిరీలు
- లీటరుకు రూ.5 కోత
- మహరాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి అధికంగా ఉత్పత్తి
- నష్టాలు తప్పవంటున్న పాడి రైతులు



రాప్తాడు, జూన్ 22: నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి.. కరివేపాకు నుంచి కారం పొడి దాకా ధరలు భగ్గుమంటున్నాయి. కానీ పాడి రైతులు కష్టపడి ఉత్పత్తి చేసిన ఆవు పాల ధరలు మాత్రం తగ్గించేశారు. పాలు అధికంగా వస్తున్నాయి.. డిమాండ్ లేదని, డెయిరీ నిర్వాహకులు అంటున్నారు. దీంతో రైతులకు ఆందోళనే మిగులుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఆవు పాల ధరలు తగ్గించేశారు. ప్రైవేటు డెయిరీలు లీటరు పాలపై రూ.5 తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. జిల్లాలో పాడి ఆవులు అధికంగా ఉన్నాయని, పాల ఉత్పత్తి పెరిగిందని, ఇతర రాష్ట్రాల పాలు తక్కువ ధరకే సరఫరా అవుతున్నాయనే కారణంతో పాల ధరలు తగ్గించేశారు. అయితే పాల ధరలు తగ్గిస్తే పశువులనే నమ్ముకుని జీవనం సాగించే రైతులు గిట్టుబాటు కాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాణా ధరలు, రవాణా చార్జీలు పెరిగినా పాల ధరలు తగ్గించడం అన్యాయమని వాపోతున్నారు. డెయిరీ నిర్వాహకులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇలా అయితే నష్టాల పాలు కాక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రాప్తాడులో షెడ్‌లో ఉన్న పాడి ఆవులు

లీటరుకు రూ. 5 వరకూ తగ్గించారు



: గేటు సత్తి, రైతు గంగలకుంట

మాది వ్యవసాయ కుటుంబం. వ్యవసాయం, పాడి పరిశ్రమపైనే జీవనం సాగిస్తున్నాం. 4 పాడి ఆవులు ఉన్నాయి. రోజూ 30 లీటర్ల పాలు ప్రైవేటు డెయిరీకి పోస్తాం. ప్రతి 15 రోజులకు లేదా 10 రోజులకు ఒకసారి బిల్లు చెల్లిస్తారు. ఇది వరకూ ఆవు పాలు నాణ్యత బట్టి లీటరుకు 35 నుంచి 40 వరకూ చెల్లించేవారు. ప్రస్తుతం పాల దర లీటరకు రూ. 5 వరకూ తగ్గించారు. పాడి పశువులకు ఉపయోగించే దాణా ధరలు పెరిగి పోయాయి. పాల ధరలు మాత్రం తగ్గిస్తే ఎలా.?. దీనిపై డెయిరీలు ఆలోచించాలి.

గిట్టుబాటు కాదు



: ఉజ్జినప్ప రైతు, గొందిరెడ్డిపల్లి

నాకు 6 పాడి ఆవులు ఉన్నాయి. రోజూ 40 లీటర్ల పాలు ఓ ప్రైవేటు డైరీకి పంపుతాను. ప్రస్తుతం లీటరుపై రూ. 5 వరకూ తగ్గించారు. వేలకు వేలు పెట్టి కొన్న పాడి ఆవులను మేపడం ఎలా..పాల ధరలు తగ్గిస్తే రైతులకు గిట్టుబాటు కాదు.

సాగు సాధ్యం కాకే.. పాడి వైపు..

పంటల సాగుకు పెట్టుబడులు ఎక్కువ కావడం, పంట చేతికందే సమయంలో అతివృష్టి, అనావృష్టి, గిట్టుబాటు దర లేకపోవడం తదితర కారణాల వలన రైతులు నష్టాలతో అప్పుల పాలవుతున్నారు. వ్యవసాయం భారమవుతున్న తరుణంలో జిల్లాలో అనేక మంది రైతులు పాడి పశువుల పెంపకంపై దృష్టి సారించారు. పాడి ఆవులు కొనుగోలు చేసి పాల ఉత్పత్తి ద్వారా వచ్చిన డబ్బుతో పిల్లల చదువులు, జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 4.97 లక్షల పాడి ఆవులు ఉన్నట్లు జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారులు తెలిపారు. రోజూ దాదాపు 30 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. పాలను ఎక్కువగా ప్రైవేటు డైయిరీలే సేకరిస్తున్నాయి. జిల్లాలోని పలు ప్రైవేటు డెయిరీలు ఇప్పటికే పాల ధరలు లీటరుపై రూ. 5 తగ్గించారు. మరికొన్ని ప్రైవేటు డెయిరీలు ఈనెల 20 నుంచి పాల దరలు తగ్గించారు. పరిమితికి మించి పాలు ఎక్కువగా వస్తున్నాయని అందువలన రేటు తగ్గించాల్సి వస్తోందని డెయిరీ యజమానులు చెబుతున్నారు. మహరాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి పాలు ఇక్కడికి దిగుబడి అవుతున్నాయి. దానికి తోడు స్థానికంగా కూడా పాల ఉత్పత్తి అధికంగా పెరిగింది. దీంతో ధరలు తగ్గించాల్సి వస్తోందని డెయిరీ యజమానులు ఏజెంట్లకు చెబుతున్నారు. అయితే ప్రైవేట్ డెయిరీ యజమానులందరూ సిండికేట్ అయ్యి పథకం ప్రకారం పాల దరలు తగ్గించారని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

దాణా, ఆవుల ధరలూ అధికమే

ఒక పాడి ఆవు కొనుగోలు చేయాలంటే రూ. 50 వేల నుంచి లక్ష వరకూ ఖర్చు చేయాల్సి ఉంటుంది. పశువులకు మేత, దాణాలైన నూక, బిస్కెట్, వడియాలు, బుస, పొప్పిలిపిండి ఇతర దాణాలు రేట్లు అధికంగా ఉన్నాయి. పాడి పశువును పోషించాలంటే అధికంగా ఖర్చవుతుంది. లీటరు ఆవు పాలకు రూ. 40 ఇస్తేనే రైతులకు గిట్టుబాటు అవుతుంది. గత 15 రోజుల వరకు పాల నాణ్యతను బట్టి లీటరుకు రూ. 35 నుంచి 40 వరకూ రైతులకు చెల్లించారు. ప్రసుత్తం దరలు తగ్గించడంతో కొన్ని డెయిరీలు ఇప్పటికే తగ్గిన ధరల ప్రకారం రైతులకు చెల్లిస్తున్నారు.

పాలు పంపొద్దంటున్నారు : ఆది డెయిరీ ఏజెంట్



నేను ప్రతి రోజు దాదాపు 1400 లీటర్లు పాలు రైతుల నుంచి సేకరించి ఓ ప్రైవేటు డెయిరీకి పంపిస్తాను. 10 రోజులకు ఒకసారి రైతులకు పాల బిల్లు చెల్లిస్తా. పాల దిగుబడి పెరిగిందని, ప్రస్తుతం డెయిరీకి పంపుతున్న పాల కంటే ఎక్కువ పాలు పంపద్దని డెయిరీ యజమానులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పాలు ఎక్కువగా అధికంగా సరఫరా అవుతున్నాయని, ఆ పాలు ఇక్కడ పాలకు ఇచ్చే ధర కంటే తక్కువ ధరకే ఇక్కడికి పంపుతున్నారన్నారు. రైతుల పాలు వద్దనలేక ఏజెంట్లు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో డెయిరీ ఏజెంట్లు పాలు సేకరించడం మానేస్తున్నారు.

పోలీసులనే డబ్బులు అడుగుతావా..?

- అర్ధరాత్రి నకిలీ పోలీసుల హంగామా
- డాబాలో బిల్లు కట్టమన్నందుకు మహిళపై దాడి
- పోలీసుల రాకతో పరార్

రాప్తాడు, జూన్ 22: 'మేము..పోలీసులం మమ్మల్నే బిల్లు కట్టమంటావా?' అంటూ డాబా నిర్వాహకులపై బెదిరింపులకు దిగారు. అడ్డు వచ్చిన మహిళపైనే దాడికి దిగారు. నకిలీ పోలీసులు.. మందేసి నానా యాగీ చేశారు. డాబా వద్ద అర్ధరాత్రి హల్ చల్ చేశారు. డాబా యజమాని, అసలైన పోలీసులు అక్కడికి రావడంతో నకిలీ పోలీసులు కారులో వెళ్లిపోయారు. వివరాలు ఇలా.. రాప్తాడు సమీపం ప్రసన్నాయపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ డాబాకు శుక్రవారం అర్ధరాత్రి వీఆర్‌లో ఉన్న ఓ కానిస్టేబుల్‌తో పాటు మరో ఇద్దరు ఏపీ39జేఎఫ్ 2766 కారులో వచ్చారు. అప్పటికే వారు మద్యం తాగి ఉన్నారు. డాబాలో ఫుడ్ ఆర్డర్ చేసి కావల్సినంత తిన్నారు. బిల్లు కట్టమంటే తాము పోలీసులమని (వీఆర్ కానిస్టేబుల్ తోపాటు వచ్చిన ఇద్దరు) బిల్లు కట్టేది లేదని దబాయించారు. డాబా సిబ్బందిని బూతులు తిట్టారు. తినగా మిగిలిన ఆహారాన్ని వారిపై విసిరి నానా యాగీ చేశారు. 'తిన్నారు కదా? బిల్లు కట్టాల్సిందే' అని నిలదీయడంతో తనపై దాడి చేశారని బాధిత మహిళ వాపోయింది. అక్కడ ఉన్న వారు రాప్తాడు పోలీసులకు ఫోన్ చేయడంతో స్టేషన్‌లో ఉన్న ఓ కానిస్టేబుల్ అక్కడికి వచ్చాడు. డాబాలో పని చేసే సిబ్బంది, యజమాని అక్కడికి వచ్చి 'మీరు ఏ స్టేషన్ పోలీసులు? ఏ ఊరు మీది? ఎక్కడి నుంచి వచ్చారు?' అని నిలదీయడంతో వారు వెంటనే కారులో ఎక్కారు. అక్కడున్న వారు సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తుండగా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఎక్కువ మంది గుమిగూడటంతో వారు కారులో అక్కడి నుంచి వెళ్లిపోయారు. రాప్తాడు సీఐ మునిస్వామి శనివారం ఉదయం డాబా వద్దకు వెళ్లి ఘటనపై ఆరా తీశారు.



పోలీసునంటూ హల్ చల్ చేసిన వ్యక్తి



వారు వచ్చింది ఈ కారులోనే..

టీడీపీ, వైసీపీ వర్గాల ఘర్షణ

తాడిపత్రిటౌన్, జూన్22: మండలంలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య నీటి విషయంలో ఘర్షణ జరిగింది. బ్రాహ్మణపల్లికి గ్రామం వైసీపీ నాయకులు చెన్నారెడ్డి, టీడీపీకి చెందిన ఖాదర్‌బాషా, కతాలప్పలు శనివారం రాత్రి ఘర్షణ పడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి నీరు టీడీపీకి చెందిన కతాలప్ప ఇంటి వద్ద నీరు నిలబడ్డాయి. వైసీపీకి చెందిన చెన్నారెడ్డి ఇంటివద్ద రోడ్డు ఎత్తుగా ఉండడంతో నీరంతా వచ్చి తమ ఇంటివద్ద నిలబడుతోందని కతాలప్ప చెన్నారెడ్డితో వాగ్వాదానికి దిగాడు. మాటమాటా పెరగడంతో కతాలప్పతోపాటు మహబూబ్‌బాషా, హుస్సేన్, ఖలీల్‌తోపాటు మరికొంతమంది కలిసి చెన్నారెడ్డి, రాజమోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రమేష్‌రెడ్డిలపై దాడిచేశారు. చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు అనంతరం కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.



కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌తో చర్చిస్తున్న రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్

ప్రీ బడ్జెట్ సమావేశానికి హాజరైన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల

అనంతపురం అర్బన్, జూన్ 22 : న్యూఢిల్లీలోని భారత్ సమ్మిట్ రూమ్‌లో ప్రీ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నిర్వహించిన ఈ సమావేశంలో పలు రాష్ట్రాల ఆర్థిక శాఖా మంత్రులు పాల్గొన్నారు. సమావేశానికి రాష్ట్రం తరుపున ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

- ముగ్గురికి గాయాలు

గుత్తిరూరల్, జూన్ 22: మండలంలోని కొత్తపేట గ్రామశివారు 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో విష్ణు(4) అనే బాలుడు మృతి చెందాడు. శనివారం తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా పెన్నాగరం గ్రామానికి చెందిన కార్తీక్, భార్య సత్య, కుమారుడు విష్ణు, బావమరిది మోహన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై హైదరాబాద్ వెళ్తున్నారు. కొత్తపేట గ్రామా శివారులోకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో నలుగురికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విష్ణు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కార్తీక్ హైదారాబాద్‌లో హాట్ చిప్స్ దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



మృతి చెందిన విష్ణు..రోదిస్తున్న తల్లిదండ్రులు

జాతీయ పోటీలకు రెఫరీగా రామాంజనేయులు



అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 22: జిల్లా తైక్వాండో కోచ్‌కు అరుదైన గౌరవం దక్కింది. తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, అస్సోం తైక్వాండో ఫెడరేషన్ సంయుక్తంగా 24వ తేదీ నుంచి అస్సోంలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. పోటీలకు తైక్వాండో జిల్లా కోచ్ మల్లెల రామాంజనేయులు చీఫ్ రెఫరీగా ఎంపికయ్యారు. ఆయనను జిల్లా క్రీడాకారులు, కోచ్‌లు అభినందించారు.

సైకిల్‌పై కళ్యాణదుర్గం నుంచి అమరావతికి..

- అమిలినేని సురేంద్రబాబుపై అభిమానంతో 520 కిలోమీటర్లు సైకిల్ తొక్కిన టీడీపీ కార్యకర్త

కళ్యాణదుర్గం, జూన్ 22 : రాష్ట్రంలో టీడీపీ పాలన రావాలని , చంద్రబాబు సీఎం కావాలని ఆకాంక్షించడమే కాకుండా ఎమ్మెల్యేగా అమిలినేని సురేంద్రబాబు విజయం సాధించడంతో అతను అభిమానాన్ని చాటుకున్నారు. కళ్యాణదుర్గం నుంచి అమరావతి వరకు ఓ అభిమాని సైకిల్ తొక్కుకుంటూ వెళ్లాడు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన రాయలసీమ రామన్న వారం రోజుల క్రితం కళ్యాణదుర్గం నుంచి సైకిల్ తొక్కుకుంటూ వెళ్లి శనివారం అమరావతి చేరుకున్నారు. అమిలినేని సురేంద్రబాబుపై అభిమానంతో 520 కిలోమీటర్లు సైకిల్ తొక్కుకుంటూ అమరావతికి చేరానని తెలిపారు. చంద్రన్న పాలన రావాలని కోరుకున్నానని, నెరవేరడంతో సైకిల్ తొక్కుకుంటూ వెళ్లానన్నారు.



అమరావతికి సైకిల్‌పై వెళ్లిన రాయలసీమ రామన్న

జేఎన్‌టీయూ విద్యార్థుల ప్రతిభ విశ్వవ్యాప్తం

- రిజిస్ట్రార్ శశిధర్

అనంతపురం సెంట్రల్, జూన్ 22: జేఎన్‌టీయూలో సాంకేతిక విద్యనభ్యసించిన విద్యార్థులు విశ్వవ్యాప్తంగా ప్రతిభను చాటి జిల్లాకు ఖ్యాతిని గడిస్తున్నారని వర్సిటీ రిజిస్ట్రార్ శశిధర్ ప్రశంసించారు. శనివారం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల 1994-98 విద్యా సంవత్సరం బీటెక్ పూర్తిచేసిన అన్ని బ్రాంచ్(కోర్సు)ల విద్యార్థులు సిల్వర్ జూబ్లీ రీయూనియన్ ఉత్సవాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ రజిత అధ్యక్షత వహించారు. రిజిస్ట్రార్ శశిధర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, ప్రొఫెసర్ క్రిష్ణయ్య, మాజీ వీసీ వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు జిల్లాగా పేరొందిన అనంతపురం జేఎన్‌టీయూ ఏర్పాటు చేయడం ఈ ప్రాంత విద్యార్థులకు వరంగా మారిందన్నారు. ఏడు దశాబ్దాలకుపైగా లక్షలాదిమంది విద్యార్థులు ఇక్కడ ఇంజనీరింగ్ పూర్తిచేసి ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో స్థిరపడ్డారని హర్షం వ్యక్తం చేశారు. 1994-98 బ్యాచ్ విద్యార్థులు వివిధ దేశాల్లో కార్పొరేట్ సంస్థలు ఏర్పాటుచేసి అనేకమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ఆయా బ్రాంచ్‌ల విద్యార్థులు వారి విభాగాధిపతులను ఘనంగా సత్కరించి తరగతుల జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కార్యక్రమంలో విభాగాధిపతులు భారతి, మమత, కళ్యాణిరాధ, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దిలీప్‌తోపాటు పూర్వపు విద్యార్థులు డాక్టర్ రమేష్, అశోక్, కిరణ్‌కుమార్, అనీల్, రామకృష్ణ, ప్రసాద్, సతీష్, చంద్రమౌళి, హరి, మిథున్, మణీష్, పంత్వార్, మల్లికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులతో రిజిస్ట్రార్, విభాగాధిపతులు



ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి

పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు

నల్లచెరువు, జూన్ 22: ప్రసిద్ధిగాంచిన పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. వేకువజామునే అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని అర్చనలు చేయించారు. భక్తులకు తీర్థప్రసాదాల వితరణ, అన్నదానం జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ సీ.రవీంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలకమండలి సభ్యుల రాజీనామా

పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి పాలకమండలి చైర్మన్ భాస్కర్‌రెడ్డితో పాటు సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను దేవాలయ కార్యనిర్వాణాధికారి సీ. రవీంద్రరాజుకు శనివారం అందించారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ శ్రేణులు

ఓబుళదేవరచెరువు, జూన్ 22: చంద్రబాబు ముఖ్యమంత్రిగా, పల్లె సింధూరారెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించినందుకు గాను మండల టీడీపీ శ్రేణులు శనివారం మొక్కులు తీర్చుకున్నారు. దిగువపల్లికి చెందిన బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెరిపిటి అంజనప్ప , ఆయన కుటుంబ సభ్యులు, బూత్ కన్వీనర్ రాకేష్ తదితరులు తిరుమలలో 101 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. అలాగే కొండకమర్ల పంచాయతీకి చెందిన నాయకులు పుట్టపర్తి మండలం ఎగువ గంగిరెడ్డిపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో 101 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ కన్వీనర్ రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీ జయమ్మ, నాయకులు శంకరయ్య, గంగాద్రి, చెంద్రాయుడు, గురుమూర్తి, నారాయణస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్కదేవతల ఉట్ల పరుష ప్రారంభం



అక్కదేవతల పెట్టెను ఊరేగిస్తున్న పూజారులు

నల్లమాడ, జూన్ 22: మండలంలోని ఎద్దులవాండ్లపల్లి గ్రామ సమీపంలో వెలసిన అక్కదేవతల ఆలయం వద్ద శనివారం దాసంగాలతో ఉట్ల పరుష ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా తొలిరోజున అక్కదేవతల పెట్టెను నల్లమాడలోని పూజారుల నివాసం నుంచి ఊరేగింపుగా ఉరుములు, వాయిద్యాల నడుమ ఎద్దులవాండ్లపలిలోని ఆలయం వద్దకు తీసుకొచ్చారు. ఊరేగింపులో భక్తులు పాల్గొని పెట్టెకు పూజలు చేశారు. ఆదివారం విడిదినం. సోమవారం యలవగంప ఊరేగింపు, మంగళవారం ఎడ్ల బండ్లతో ప్రదక్షిణ జరుగుతాయని, బుధవారం కుంకాలతో అక్కదేవతల ఉట్లపరుష ముగుస్తుందని పూజారులు తెలిపారు. చౌటకుంటపల్లి, నల్లమాడ, ఎద్దులవాండ్లపల్లి, ఎద్దులవాండ్లపల్లితండా తదితర గ్రామాలనుంచి భక్తులు పెద్దఎత్తున పరుషలో పాల్గొంటారని వారు చెప్పారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

ముదిగుబ్బ, జూన్ 22: మండలంలోని మంగళమడక గ్రామంలో టీడీపీ, వైసీపీ వర్గీయులు శనివారం ఘర్షణకు దిగారు. దీంతో ఇరువర్గాలకు చెందిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పట్నం ఎస్‌ఐ నరసింహులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళమడక గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలకు వైసీపీకి చెందిన బయపరెడ్డి నేమ్ బోర్డు రాయడానికి సిద్ధమయ్యారు. దీనిని గమనించిన టీడీపీ నాయకులు గంగాధర్, వెంగముని , ఓబులేశు అక్కడికి చేరుకుని అభ్యంతరం చెప్పారు. దీంతో బయపరెడ్డి వెనుదిరిగి వెళ్లాడు. అదే సమయంలో అక్కడి వచ్చిన వైసీపీకి చెందిన మరో నాయకుడు కిరణ్‌రెడ్డి, టీడీపీ నాయకులతో వాగ్వాదానికి దిగాడు. దీంతో మాటామాటా పెరిగి పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ దాడిలో కిరణ్‌రెడ్డికి, టీడీపీకి చెందిన ఓబులేశుకు గాయాలయ్యాయి. కిరణ్‌రెడ్డిని కదిరి ప్రభుత్వాస్పత్రికి, ఓబులేశును అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు ఎస్‌ఐ తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ధర్మవరం, జూన్ 22: పట్టణంలోని తొగట వీధిలో ఆదివారం చౌడేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 100వ ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వెంకట రమణ, ప్రధానకార్యదర్శి రాధాకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో వైద్యులు పలు రకాల వైద్యపరీక్షలు చేస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జయంతిని అన్ని వార్డుల్లోనూ జరపాలి

ధర్మవరం, జూన్ 22: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను ఆదివారం పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ నిర్వహించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబులేశు, జింకాచంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ముందుగా బీజేపీ కార్యాలయంలో నివాళులర్పించాలని, తర్వాత అన్నివార్డుల్లో జయంతి వేడుకలు నిర్వహించాలని సూచించారు. అందుకు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ

బత్తలపల్లి, జూన్ 22: మండలంలోని ఉప్పర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నోటు పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి నాయకులు సురేంద్రనాయుడు, రవి, నారాయణస్వామి, కుళ్లాయప్ప, నాగభూషణ, రమణ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్ ఇంకెప్పుడిస్తారో..?

- హమాలీ కాలనీలో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు
- ఆరేళ్లు గడుస్తున్నా కనెక్షన్ ఇవ్వలేదు
- లో వోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్న స్థానికులు

ధర్మవరం, జూన్ 22: పట్టణంలోని 25వ వార్డులో గల హమాలీ కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏళ్లు గడుస్తున్నా కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో అప్పటి నుంచి నిరుపయోగంగానే ఉంది. ఫలితంగా కాలనీలో లోఓల్టేజీ సమస్య నెలకొంటోందని, దీంతో ఇబ్బంది పడుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఆ తరువాత వెంటనే వైసీపీ అధికారంలోకి వచ్చింది. అయితే టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కదా.. తామెందుకు కనెక్షన్ ఇప్పించాలని అనుకున్నారేమో..! ఇంతవరకు ప్రజాప్రతినిధులు కానీ, ట్రాన్స్‌కో అధికారు లు కానీ పట్టించుకోలేదు. ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇవ్వాలని స్థానికులు పలు మార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో లోడ్ ఎక్కువై తరచూ లోఓల్టేజీ సమస్య ఏర్పడుతోంది. దీనివల్ల తరచూ ఇళ్లలో ఎలక్ట్రిక్ పరికరాలు కాలిపోతున్నాయని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. స్థానిక కౌన్సిలర్ కూడా ట్రాన్స్ ఫార్మర్‌కు కనెక్షన్ ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని వాపోతున్నారు. కొత్తప్రభుత్వంలో నైనా ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇప్పించి లోఓల్టేజీ సమస్యను తీర్చాలని వారు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

రమణాశ్రమంలో ఏరువాక పౌర్ణమి



రమణాశ్రమంలో గోవుకు పూజలు చేస్తున్న భక్తులు



కొండకిందతండాలో వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్న రైతు

ధర్మవరం, జూన్ 22: పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో గల రమణ మహర్షి ఆశ్రమంలో శనివారం ఆశ్రమ వ్యవస్థాపకుడు చిప్పల వెంకప్ప ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తొలుత ఆశ్రమంలోని అరుణాచలేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోవు నెయ్యితో జ్యోతిని వెలిగించి అక్షరమణమాల పారాయణం చేశారు. గోమాతకు పూజలు చేశారు. మధ్యాహ్నం 1గంటకు నారాయణసేవ ఏర్పాటు చేశారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ఆయా పూజల్లో పాల్గొన్నారు.

కదిరి: మండలంలోని కొండకిందతండాలో శనివారం ఏరువాక పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పొలాల్లో పూజలు చేసి వ్యవసాయ పనులు ప్రారంభించారు. గోవులను, ఎడ్లను కూడా పూజించారు.

మధ్యాహ్నభోజనంలో మెనూ తప్పక పాటించాలి

ఓబుళదేవరచెరువు, జూన్ 22: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పకుండా పాటించాలని ఎంఈఓ-2 రమణ ఉపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని గౌనిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం రుచిగా, నాణ్యతగా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మెనూ పాటించాలని ఉపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ రియాజ్, సీఆర్పీ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

నల్లమాడ: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పక పాటించాలని ఎంఈఓలు వేమనారాయణ, సురేష్ బాబు ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాలలో మెనూ మేరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండాలన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



గౌనిపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రమణ

కందికుంట ఆర్థికసాయం



బాధితుడి తల్లికి రూ.50వేలు ఇస్తున్న టీడీపీ శ్రేణులు

నల్లచెరువు, జూన్ 22: మండలకేంద్రంలోని యోగివేమన ఆలయం వద్ద ఉన్న టీడీపీ కార్యకర్త బీవీ పవన్‌కుమార్‌కు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రూ. 50వేలు ఆర్థికసాయం పంపించగా.. ఆ మొత్తాన్ని మండల కన్వీనర్ పీ. రాజశేఖర్ బాధితుడి తల్లికి శనివారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్త బీవీ పవన్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారని, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట అతడి వైద్య ఖర్చులకోసం ఈ ఆర్థికసాయం అందించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాబూసాబ్, నాయకులు గుప్త ప్రసాద్, అంజనప్ప, ఫకృద్దీన్, శ్రీనివాసులు, మోక్షజ్ఞ, వినోద్, సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.

తొలగని నవరత్నాల బోర్డు



ఆర్బీకే భవనానికి అలాగే ఉన్న నవరత్నాల బోర్డు

నంబులపూలకుంట, జూన్ 22: మండలంలోని ధనియాన్‌చెరువు రైతుభరోసా కేంద్రం భవనానికి ఏర్పాటు చేసిన నవరత్నాల బోర్డును ఇంకా తొలగించలేదు. వైసీపీ పాలన ముగిసి, కూటమి అధికారం చేపట్టినా.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటంతో ఉన్న నవరత్నాల బోర్డును ఆర్బీకే భవనానికి అలాగే ఉంచారని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ బోర్డును తొలగించాలని వారు కోరుతున్నారు.

గ్రామాల్లో సమస్యలు గుర్తించండి

తనకల్లు, జూన్ 22: గ్రామాల్లోని ప్రజా సమస్యలను గుర్తించాలని టీడీపీ మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. మండలకేంద్రంలోని కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపలో శనివారం ఆయన మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను గుర్తించి వాటిని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌తో పాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తెలిపారు. ఇందుకు అందరూ సమష్టిగా పని చేయాలన్నారు. గ్రామాల్లో కక్షలకు దూరంగా ఉండాలన్నారు. సమస్యలొస్తే కలిసికట్టుగా పరిష్కరించుకుందామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దేశాయి విదురశేఖర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ప్రభారెడ్డి, శంకర్‌నాయుడు, రాజారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకర గుంతపై గ్రిల్ ఏర్పాటు



గుంతపై గ్రిల్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ధర్మవరం, జూన్ 22: పట్టణంలోని ప్రధాన సర్కిల్ అయిన పీఆర్‌టీలో ప్రమాదకరంగా ఉన్న గుంతను మున్సిపల్ అధికారులు శనివారం గ్రిల్ వేసి మూసి వేశారు. పీఆర్‌టీ వీధిలో గుంత ప్రమాద కరంగా ఉంది. ముఖ్యంగా వర్షాలు కురిసినప్పుడు ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానం నుంచి నీరు దిగువ భాగమైన పీఆర్‌టీ వీధిలోకి చేరుకుని మోకాళ్ల లోతులో ప్రవహిస్తుంది. ఆ సమయంలో ఆ గుంత కనపడదు. నీరే కదా అని ఎవరైనా అడుగు వేస్తే ప్రమాదానికి గురికావాల్సిందే. ఇప్పటికే చాలా మంది గుంతలోకి పడి న సంఘటనలు చాలా ఉన్నాయని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యేకు పలుసార్లు విన్నవించినా పట్టించుకోలేదున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ ప్రత్యేక చొరవతీసుకుని మున్సిపల్ అధికారులతో మాట్లాడి గుంతపై గ్రిల్ ఏర్పాటు చేయించారని, దీంతో ఎవరికీ ఏ ఇబ్బంది ఉండదని వారు ఆనందం వ్యక్తం చేశారు.

భక్తులతో కిటకిటలాడిన పెన్నహోబిలం ఆలయం



అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

ఉరవకొండ,జూన్ 22: మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి శనివారం భక్తులతో కిటకిటలాడిం ది. ఉదయమే స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల అనంతరం ఆలయంలో నెలపూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. జిల్లా నలుమూలలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

వైభవంగా ప్రాకారోత్సవం: ఆలయంలో ప్రాకారోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి, పల్లకిలో కొలువుదీర్చారు. ఉత్సవమూర్తులను మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు.



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ఆవరణం

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

- మంత్రి నిమ్మల రామానాయుడును కోరిన ఎమ్మెల్యే పల్లె సింధూర



మంత్రి నిమ్మల రామానాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి

పుట్టపర్తి, జూన్ 22: పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని, ముఖ్యంగా నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణాజలాలతో నింపేందుకు సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి జనవరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. విజయవాడలోని కార్యాలయంలో శనివారం ఆమె మంత్రిని తన మామ పల్లె రఘునాథరెడ్డితో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. పుట్టపర్తి నియోజకవర్గంలో వ్యవసాయమే ప్రధాన జీవనమన్నారు. వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయడానికి నియోజకవర్గంలో 193 చెరువులను కృష్ణాజలాలతో నింపాలన్నారు. వ్యవసాయాభివృద్ధికి తగిన సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఆమె మంత్రులు సత్యకుమార్‌యాదవ్, సవిత, ఫరూక్, కొండపల్లిశ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, పయ్యావుల కేశవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

డిప్యూటీ సీఎంను కలిసిన చిలకం

ధర్మవరం,జూన్ 22: డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్‌శాఖా మంత్రి పవన్‌కల్యాణ్‌ను జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి శనివారం కలిశారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన్న మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన అనంతపురం జిల్లా అధ్యక్షుడు టీసీవరుణ్ కూడా ఉన్నారు.



పవన్‌కల్యాణ్‌ను కలిసిన చిలకం మధు


చిరుధాన్యాలసాగుపై అవగాహన

కదిరి, జూన్ 22: పట్టణంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శనివారం ఆ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జాన్సన్, శాస్త్రవేత్త రామసుబ్బ ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగుపై అవగాహనా సదస్సు జరిగింది. చిరుధాన్యాల సాగుకు చేపట్టాల్సి పద్ధతులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. చిరు ధాన్యాల సాగుద్వారా తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. అనంతరం పలువురికి చిరుధాన్యాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ, వ్యవసాయాధికారులు, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



చిరుధాన్యాలు పంపిణీ చేస్తున్న అధికారులు

ఇస్కాన్ మందిరంలో పౌర్ణమి వేడుకలు



ప్రత్యేకాలంకరణలో బలరామ, సుభద్ర, జగన్నాథుడి ప్రతిమలు

ధర్మవరం రూరల్, జూన్ 22: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న ఇస్కాన్‌మందిరంలో శనివారం జగన్నాథుడికి స్నాన పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా తొలుత మందిరంలో కొలువుదీరిన బలరామ, సుభద్ర, జగన్నాథుడి ప్రతిమలను అలంకరించి పూజలు చేశారు. అనంతరం జగన్నాథుడికి స్నానమార్చన చేశారు. పూరిలో జగన్నాథుడికి చేసేవిధంగా ఇక్కడ కూడా నిర్వహించడం జరిగిందని ఇస్కాన్ భక్తులు తెలిపారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. హరేకృష్ణ, హరేరామ సంకీర్తనలు చేశారు. కార్యక్రమంలో ధర్మవరం ఇస్కాన్ ధర్మప్రచారకులు శ్రీకృష్ణమాధవదాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

నల్లచెరువు, జూన్ 22: మండలంలోని గొర్లవాండ్లపల్లికి చెందిన 63 ఏళ్ల వయసు గల రొద్దం సూర్యనారాయణరెడ్డి కనిపించలేదని, ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని ఎస్‌ఐ కేఎం. లింగన్న శనివారం తెలిపారు. అదృశ్యమైన వ్యక్తి మండలకేంద్రంలోని వీవర్స్‌కాలనీలో కుమార్తె సుమతి ఇంటిలో ఉండేవారన్నారు. కాగా ఈ నెల 15వ తేదీ రాత్రి 10గంటల నుంచి కనిపించలేదని, ఇంట్లో చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడని అన్నారు. గత కొద్దిరోజులుగా మతిస్థిమితం సరిగా లేకుండా ఉన్నాడన్నాడు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 949092 2418కు సమాచారం అందించాలని ఆయన కోరారు.



రొద్దం సూర్య నారాయణరెడ్డి

పోలీస్ పీఆర్‌ఓకు ప్రశంసాపత్రం

పుట్టపర్తి రూరల్, జూన్ 22: పోలీసులు - మీడియా మధ్య వారధిగా ఉంటూ పోలీసుశాఖ తరఫున ఎప్పటికప్పుడు సమాచారం అందించడంలో పీఆర్‌ఓల పాత్ర కీలకమని ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఎస్పీ మాట్లాడారు. జిల్లా పోలీసు శాఖ పీఆర్‌ఓగా పనిచేస్తున్న వడ్డే వెంకటేశ్ ఎన్నికల సమయంలో పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు చేరవేస్తూ సమర్థవంతంగా సేవలందించారని కొనియాడారు. పోలీసుశాఖకు తేవడంలో వెంకటేశ్ కృషిని ప్రశంసించారు. అనంతరం ఆయనకు ప్రశంసాపత్రంతోపాటు మెమొంటోను అందజేశారు.



పీఆర్‌ఓకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ

పాఠశాలను పరిశీలించిన డీఈఓ

గోరంట్ల, జూన్ 22: మండల పరిధిలోని పలు పాఠశాలల స్థలాలు, ప్రహరీలు జాతీయ రహదారి విస్తరణలోకి వెళ్తున్నాయి. దీంతో జిల్లా విద్యా శాఖాధికారి మీనాక్షి శనివారం మండల పరిధిలోని బూదిలి, కోడూరు, గౌనివారిపల్లి పాఠశాలలను పరిశీలించారు. ముదిగుబ్బ నుంచి కోడూరు వరకు జాతీయ రహదారిని విస్తరణ కోసం స్థలాలను కోల్పోతున్న గోరం ట్ల మండలంలోని బూదిలి, చిలమత్తూరు మండలంలోని కోడూరు ఉన్నత పాఠశాలలను ఆమె సందర్శించారు. హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి, వారు నిర్వహించిన కొలతలను స్వయంగా పరిశీలించారు. తదుపరి చేపట్టాల్సిన చర్యలు, నిర్మాణాల పనులపై ఆయా పాఠశాల సిబ్బంది, ఎంఈఓలతో మాట్లాడారు. అలాగే ముద్దనూరు నుంచి హిందూపురం వరకు చేపట్టిన జాయతీ రహదారి పనుల్లో భాగంగా స్థలాన్ని కోల్పోతున్న గౌనవారిపల్లి పాఠశాలను పరిశీలించారు. గోరంట్ల బాలుర ఉన్నతపాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి గంతం ధీరజ్ రూపొందించిన లర్న్ఈజీ ఎడ్యుకేషన్ యాప్‌ను డీఈఓ పరిశీలించి ప్రారంభించారు. డీఈఓ వెంట ఎంఈఓలు ఎంఈఓలు జాన్‌రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.



బూదిలిలో హైవే అధికారులతో చర్చిస్తున్న డీఈఓ మీనాక్షి

ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోండి: ఎస్ఎఫ్ఐ

హిందూపురం, జూన్ 22 : ఫిట్‌నెస్ లేకుండా విద్యార్థులను తరలిస్తున్న ప్రైవేట్ బస్సులను సీజ్ చేసి, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం ఆర్టీఓ కరుణాసాగర్‌రెడ్డికి కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ.... జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన పలు బస్సుల కండీషన్ సరిగాలేదన్నారు. అయినా వాటిలోనే విద్యార్థులను తరలిస్తున్నారని, ఏదైనా ప్రమాదం జరిగితే విద్యార్థుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశాలు ఉన్నాయన్నారు. దీంతో వెంటనే అలాంటి బస్సులు నడుపుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. బస్సుకు డ్రైవర్‌తో పాటు క్లీనర్ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయచంద్ర, చంద్రశేఖర్, జశ్వంత్, హసీన్, అఫ్రీద్, హుస్సేన్, విక్రం, సురేష్ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

గోరంట్ల, జూన్ 22: ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో మండలంలో దోమలు ప్రబలి, వ్యాధులు వ్యాపించకుండా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శనివారం చర్యలు చేపట్టారు. దోమల వలన మలేరియా, డెంగీ, మెదడు వాపు వ్యాధులు సంక్రమిస్తాయని తెలిపారు. వ్యాధుల నివారణ కు గాను ముందుజాగ్రత్త చర్యగా గోరంట్లలోని బీసీ బాలుర వసతి గృహం, గిరిజన బాలికల వసతిగృహం, ఖాజాపురంలోని కేజీబీవీలో మ లాథియేన్ మందును పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి శివన్న, సూపర్‌వైజర్లు గంగాధర్, రంగనాథ్, ఎంపీహెచ్ఇఓ భాగ్యలక్ష్మి, పీహెచ్ఎన్ రసూల్, హాస్టల్ వార్డెన్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకవర్గం ఎంపిక

పెనుకొండ రూరల్, జూన్ 22: గుట్టూరు సమీపంలోని సత్యసాయి రైతు సమాఖ్య నూతన పాలక వర్గాన్ని ఎంపిక చేసినట్లు సమాఖ్య మేనేజర్ నాగేష్ శనివారం తెలిపారు. ఆ సమాఖ్య రైస్ మిల్లులో ఉదయం సమావేశం నిర్వహించి, 11మందిని పాలకవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. అందులో అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగ వరప్రసాద్, మిగిలిన తొమ్మిది మందిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు మేనేజర్ తెలిపారు.

గాయకుడు ఎస్పీకి ఘన నివాళి

హిందూపురం, జూన్ 22: ప్రముఖ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఇప్పుడు మన మధ్య లేకపోయినా ఆయన గొంతు ఎప్పుడు వినబడుతూనే ఉందని ఏపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేటీ శ్రీధర్ అన్నారు. అందుకే ఆయనకు మరణం లేదన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని శనివారం కొడిగెనహళ్లిలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, కళాబృందం పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా.. మారని తీరు



నడిరోడ్డుపైనే బస్సును ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్న దృశ్యం

చిలమత్తూరు, జూన్ 22: ప్రమాదాల నివారణకు....ప్రయాణికుల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అటు బస్సు డ్రైవర్లు...ఇటు ప్రయాణికులు సైతం పెడచెవిన పెడుతున్నారు. నడి రోడ్డుపై బస్సు ఆపడం...నడి రోడ్డులో నిలబడిన బస్సును ఎక్కడం ప్రమాదమని తెలిసినా వారు అదే పనిచేస్తూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో బస్టాండ్ లేదు. దీంతో ఇటు బెంగళూరు, అటు అనంతపురం, కదిరి, పుట్టపర్తి వైపు వెళ్లే బస్సులు అక్కడున్న ప్రధాన కూడలిలోనే నడిరోడ్డుపై బస్సులను ఆపుతూ ప్రయాణికులను ఎక్కించుకొని వెళుతున్నారు. ఇలా చేయడం వలన వేగంగా వచ్చే వాహనాల వల్ల ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఇలా ప్రమాదాలు జరిగిన సంఘటనలు కంటికి కనపడుతున్నా, వాటిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాల్సిన పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో పోలీసులు ఈ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా బస్సులను నడి రోడ్డుపై కాకుండా సర్వీస్ రోడ్డుపై ఆపి ప్రయాణికులను ఎక్కించుకొనేనా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రయాణికులు బస్సుల కోసం 44వ జాతీయ రహదారిపై అటూ ఇటూ పరుగులు తీయకుండా సురక్షితంగా బస్సు ఎక్కే ఏర్పాట్లు చేశారు. ఇందుకోసి అక్కడ కానిస్టేబుల్‌ను విధుల్లో ఉంచారు. కానీ ఇది కొన్ని రోజులు మాత్రమే సాగింది. ఆ తరువాత పోలీసుల సూచనలు గాలికి వదిలేసి డ్రైవర్లు కూడలిలో నడిరోడ్డుపైనే బస్సులను ఆపుతూ ప్రమాదాలకు స్వాగతం పలుకుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై పోలీసులు మరోసారి దృష్టి పెట్టి సర్వీస్ రోడ్డుపైనే బస్సులు ఆగేవిధంగా చర్యలు తీసుకోవాలని, ప్రయాణికులు సురక్షితంగా గమ్య స్థానాలకు చేరేలా చూడాలని కోరుతున్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించండి : ఎంఈఓ -2

అగళి, జూన్ 22 : బడిఈడు పిల్లలని బడిలో చేర్పించాలని ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. మండలకేంద్రంలో శనివారం పూలపల్లి, అనుమనపల్లి పాఠశాలల ఆధ్వర్యంలో నేను బడికిపోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించా మానవహారంగా ఏర్పడ్డారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కాంతరాజు, ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరహట్టిలో పారిశుధ్య పనులు

గుడిబండ, జూన్ 22 : మండలంలోని దేవరహట్టి, రాళ్లపల్లి పంచాయతీ గ్రామాల్లో శనివారం పారిశుధ్యం పనులు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవి, పంచాయతీ కార్యదర్శులు గోవిందప్ప, ధనలక్ష్మి తెలిపారు. తాగునీటి ట్యాంక్, మురుగు కాలువలు శుభ్రం చేయించామని, ఈగలు, దోమలు వ్యాపించకుండా బ్లీచింగ్ చల్లినట్లు వారు తెలిపారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప

హిందూపురం, జూన్ 22 : మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటసారిగా జిల్లాకు వస్తున్న బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత పర్యటనను విజయవంత చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే సవిత ఆదివారం మంత్రిగా మొదటిసారిగా పెనుకొండకు వస్తున్నారని, ఆమెకు స్వాగతం పలకడానికి పెద్దఎత్తున తరలి రావాలని కోరారు.

ఘనస్వాగతం పలుకుదాం



మాట్లాడుతున్న మండల కన్వీనర్ సోమశేఖర్

గోరంట్ల, జూన్ 22: మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత స్థానిక ఎమ్మెల్యే సవిత మొదటసారిగా ఆదివారం నియోజకవర్గానికి వస్తున్నారని, ఆమెకు ఘన స్వాగతం పలుకుదామని టీడీపీ మండల కన్వీనర్ సోమశేఖర్ పిలుపునిచ్చారు. గోరంట్లలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన టీడీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. బెంగళూరు విమానాశ్రయం నుంచి మంత్రి వస్తుండడంతో రాష్ట్ర సరిహద్దులోని టోల్ ప్లాజా వద్ద స్వాగతం పలకాలని నిర్ణయించారు. మండలంలోని అన్ని పంచాయతీల నుంచి ప్రత్యేక వాహనాల్లో ఉదయం 10 గంటలకు టోల్‌ప్లాజా వద్దకు చేరుకోవాలన్నారు. మంత్రి వెంట పెనుకొండ వరకు వెళ్లి, తరువాత గోరంట్ల అభివృద్ధి తదితర విషయాలను ఆమెతో చర్చించనున్నట్లు తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు దేవా నర సింహప్ప, అశ్వత్థరెడ్డి, బెల్లాలచెరువుచంద్ర, కక్క రఘు, బాలక్రిష్ణ, అశోక్, సుబ్బారెడ్డి, గిరి, అజంతుల్లా, వేణు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మించండయ్యా..!



కోతకు గురైన కల్వర్టును పరిశీలిస్తున్న గుండుమల

గుడిబండ, జూన్ 22 : వర్షాలకు కోతకు గురైన మండలంలోని పళారం పెద్దవంక కల్వర్టును పునర్ నిర్మించాలని స్థానికులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిని కోరారు. గుండుమల శనివారం ఆ మార్గంలో వెళుతున్న ఆయనకు గ్రామస్థులు విన్నవించారు. ఇటీవల కురిసిన వర్షానికి వంకు ఉధృతంగా ప్రవహించడంతో కల్వర్టు దెబ్బ తిందని తెలిపారు. దీంతో ఈ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు మాజీ ఎమ్మెల్సీకి వివరించారు. కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని గుండుమల హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దనకుంటప్ప, మంజునాథ్, షబ్బీర్, లక్ష్మీనరసప్ప, దుర్గేష్, శివకుమార్, తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

గుడిబండ : మండలపరిధిలోని బైరేపల్లి, అమరాపురం మండలం ఆలదపల్లి ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రత్యేక పూజలు చేయించారు. టీడీపీ నాయకులతో కలిసి ఆయన స్వామికి అభిషేకం, ఆకుపూజ, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మండల కేంద్రమైన గుడిబండలో శనివారం వర్షా సైనిక్ స్కూల్‌ను ప్రారంభించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పాఠశాలను ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మద్దన కుంటప్ప, లింగాయత్ జిల్లా అధ్య క్షుడు దుర్గేష్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు లక్ష్మీనర సప్ప, భీమరాజు, నాయకులు షబ్బీర్, గోవిందప్ప, శివకుమార్, ప్రకాశ్, అమరా పురం మండల కన్వీనర్ గణేష్, నాయకులు జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన డీఈఓ



బూదిలిలో హైవే అధికారులతో చర్చిస్తున్న డీఈఓ మీనాక్షి

గోరంట్ల, జూన్ 22: మండల పరిధిలోని పలు పాఠశాలల స్థలాలు, ప్రహరీలు జాతీయ రహదారి విస్తరణలోకి వెళ్తున్నాయి. దీంతో జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి శనివారం మండల పరిధిలోని బూదిలి, కోడూరు, గౌనివారిపల్లి పాఠశాలలను పరిశీలించారు. ముదిగుబ్బ నుంచి కోడూరు వరకు జాతీయ రహదారిని విస్తరణ కోసం స్థలాలను కోల్పోతున్న గోరంట్ల మండలంలోని బూదిలి, చిలమత్తూరు మండలంలోని కోడూరు ఉన్నత పాఠశాలలను ఆమె సందర్శించారు. హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి, వారు నిర్వహించిన కొలతలను స్వయంగా పరిశీలించారు. తదుపరి చేపట్టాల్సిన చర్యలు, నిర్మాణాల పనులపై ఆయా పాఠశాల సిబ్బంది, ఎంఈఓలతో మాట్లాడారు. అలాగే ముద్దనూరు నుంచి హిందూపురం వరకు చేపట్టిన జాయతీ రహదారి పనుల్లో భాగంగా స్థలాన్ని కోల్పోతున్న గౌనవారిపల్లి పాఠశాలను పరిశీలించారు. గోరంట్ల బాలుర ఉన్నతపాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి గంతం ధీరజ్ రూపొందించిన లర్న్‌ఈజీ ఎడ్యుకేషన్ యాప్‌ను డీఈఓ పరిశీలించి ప్రారంభించారు. డీఈఓ వెంట ఎంఈఓలు ఎంఈఓలు జాన్‌రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో సమస్యలు పరిష్కరించండి : బీజేపీ

హిందూపురం/ మడకశిర టౌన్, జూన్ 22 : పట్టణంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆరో గ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను బీజేపీ స్థానిక నేతలు కోరారు. మంత్రిని శనివారం విజయవాడలో కలిసి సత్కరించి, ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను వివరించినట్లు బీజేపీ నాయకులు వరప్రసాద్, అదర్శ్, శంకర్, చంద్రశేఖర్ తదితరులు తెలిపారు. వైసీపీ పాలనలో ఆసుపత్రి నిర్లక్ష్యానికి గురై పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడింది కావున తగు సౌకర్యాలు కల్పించి రోగులకు మెరుగైన సేవలు అందించాలని మంత్రికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. అలాగే మడకశిర మడకశిర నియోజకవర్గంలోని ప్రభుత్వాసుపత్రిలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా వంద పడకల ఆస్పత్రి అర్ధంతరంగా ఆగిపోయిందని, పూర్తి చేసి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరినట్లు వారు తెలిపారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని బీజేపీ నాయకులు తెలిపారు. అయనను సన్మానించారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకులు



పూజల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

హిందూపురం, జూన్ 22 : టీడీపీ అధికారంలోకి రావాలని, నందమూరి బాలకృష్ణ అధిక మెజార్టీతో గెలవాలని కర్ణాటక రాష్ట్రం లోని జగి రెడ్డి పల్లి ఆంజనేయస్వామికి మొక్కిన మొక్కులను శనివారం టీడీపీ మండల కన్వీనర్ జయప్ప ఆధ్వర్యంలో చెల్లించినట్లు పార్టీ మానెంపల్లి నాయకులు తెలిపారు. ప్రస్తుతం ఆ కోరికలు జగిరెడ్డిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి, 101 కొబ్బరికాయలు కొట్టినట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.